భానుడి భగభగ... 38.8 డిగ్రీలు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భానుడి భగ..భగలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మార్చి మొదటి వారంలోనే పలు ప్రాంతాల్లో 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సరూర్‌నగర్, కార్వాన్‌లో ఆదివారం అత్యధికంగా 38.8 డిగ్రీలు నమోదయ్యాయి. వారం రోజుల క్రితం గ్రేటర్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైతే పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 3,300 మెగావాట్లకు పెరిగింది. పగటి ఉష్ణోగ్రలతోపాటు రాత్రి ఉష్ణోగ్రత 24 డిగ్రీల వరకు నమోదవుతున్నది. మరో రెండురోజులు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఉపరితల గాలులు దక్షిణ/నైరుతి దిశలో గంటకు 4-8 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

చార్మినార్	38.4
బేగంపేట	38.7
సంతోష్‌నగర్	38.5
గోషామహల్	38.3
ఉప్పల్	38.3
కాప్రా	38.3
హయత్‌నగర్	38.0
ఎల్‌బీనగర్	37.9
మూసాపేట	37.7
రాజేంద్రనగర్	37.6
కుత్బుల్లాపూర్	37.6

సహజనటి జయసుధకు ఎక్సలెన్స్ అవార్డు


నటి జయసుధకు అవార్డు ప్రదానం చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

హైదరాబాద్ సిటీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ అఫ్ హైదరాబాద్ ఈస్ట్ వారు సినిమా, సంగీతం, వైద్య విభాగాల్లో ఇచ్చే ప్రతిష్ఠాత్మక వొకేషనల్ ఎక్సలెన్స్ అవార్డు (వృత్తిపరమైన సమర్థత పురస్కారం)ను సినీ నటి జయసుధ అందుకున్నారు. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం జయసుధకు అవార్డు ప్రదానం చేశారు. సినిమారంగం నుంచి సహజనటి జయసుధ, నటుడు కాదంబరి కిరణ్‌కుమార్, సంగీతం నుంచి ప్రఖ్యాత ఈలపాట గాయకుడు ఎంపీ రమణారెడ్డికి, బయోకెమిస్ట్రీ నుంచి డా.సాయిపద్మకు ఈ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఈస్టుకు చెందిన అధ్యక్షులు సుదేష్‌రెడ్డి, వొకేషనల్ సర్వీస్ డైరెక్టర్ సీవీ సుబ్బారావు, కార్యదర్శి టీఎంఎస్ చౌదరి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎల్లో రిబ్బన్ రన్


విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న అతిథులు

ఖైరతాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎండో మెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ జరిగిన ఎల్లో రిబ్బన్ పరుగు చూపరులను ఆలోచింప జేసింది. ఎండో మెట్రియాసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశంలో తొలిసారిగా ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ పీవీ నర్సింహారావు మార్గంలోని జలవిహార్ నుంచి సంజీవయ్యపార్కు వరకు, తిరిగి జలవిహార్ వరకు 3కె, 5కె రన్‌లు జరిగాయి. దీనిని అపోలో ఆస్పత్రి సీఈవో తేజస్విరావు ప్రారంభించగా, ఎస్‌ఎండీసీ డైరెక్టర్ వినయ్‌కుమార్, ఎల్ఐసీ అధికారులు జీవీబీ రామయ్య, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ వివీ బింద్రా మాట్లాడుతూ ఇది మహిళల్లో వచ్చే గర్భాశయ సంబంధిత వ్యాధి అని, ప్రపంచవ్యాప్తంగా 24 కోట్ల మంది మహిళలు దీనితో బాధపడుతుండగా దేశంలో 4.2 కోట్ల మంది అవస్థ పడుతున్నారని తెలిపారు. మహిళలు ప్రారంభదశలోనే చికిత్స చేయించుకునేలా చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అర్చనారెడ్డి, డాక్టర్ శ్వేతారెడ్డి, యువత పాల్గొన్నారు.

మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలి: ఆర్.కృష్ణయ్య


ధర్నాలో ఆర్.కృష్ణయ్య, తదితరులు

కవాడిగూడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరల ప్రకారం రాష్ట్రంలోని ఎనిమిది లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ గురుకుల పాఠశాల విద్యార్థులతో పాటు 16లక్షల మంది కళాశాలల విద్యార్థుల మెస్‌చార్జీలను పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లను పెంచాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం నేత జిల్లపల్లి అంజి, గుజ్జ సత్యం ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సొంత భవనాల్లో 300 హాస్టళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంఘం నాయకులు రాజేందర్, అనంతయ్య, కృష్ణయాదవ్, నరసింహగౌడ్, రఘుపతి, వంశీ, మణికంఠ విద్యార్థులు పాల్గొన్నారు.

గృహజ్యోతి బిల్లుల జారీలో సమస్యలు..!

● వివరాలన్నీ సరిగా ఉన్నవారికే జీరోబిల్లులు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి జీరోబిల్లుల జారీలో సమస్యలు తలెత్తుతున్నాయి. మార్చి 1న ఉదయం 6గంటలకే గృహజ్యోతి జీరోబిల్లుల జారీని విద్యుత్‌శాఖ ప్రారంభించినా రోజుకు ఎంతమందికి జీరో బిల్లులు జారీచేస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడించలేకపోతున్నారు. హైదరాబాద్ సౌత్‌సర్కిల్‌లోని పలుప్రాంతాల్లో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల్లో వివరాలు సరిగా లేకపోవడంతో పలువురికి సాధారణ విద్యుత్‌బిల్లులు ఇస్తున్నారు. దరఖాస్తులో అన్ని వివరాలు సరిగా నమోదుచేసి ఉండి, విద్యుత్‌శాఖ స్పాట్ బిల్లింగ్ మెషీన్లలో వివరాల పరిశీలన పూర్తయిన గృహజ్యోతి లబ్ధిదారులకు మాత్రం జీరో బిల్లులు జారీచేస్తున్నారు. అయితే గృహజ్యోతి అర్హత కలిగి వివరాలు తప్పుగా నమోదైతే జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకొని వివరాలు సరిచేయించుకుంటే వారికి కూడా జీరో బిల్లులు జారీచేస్తామని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

హైకోర్టు ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్ రన్నర్ టీఎస్ జట్టు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ హైకోర్టు ఉద్యోగుల మధ్య మంగళగిరి అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఏపీ జట్టు 18 పరుగులతో విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏపీ జట్టు 20 ఓవర్లలో 126 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు 108పరుగులకు ఆలౌటైంది. అంతకు ముందు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.జయసూర్య జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. మ్యాచ్‌లో విజయం సాధించిన ఏపీ జట్టుకు ఏపీ హైకోర్టు ప్రోటోకాల్ రిజిస్ట్రార్ ఏవీ రాఘవస్వామి ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ జట్టుకు ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్ కప్ అందించారు.

నేడు టీఎస్ఆర్టీసీ లక్కీడ్రా

చాదర్‌ఘాట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గతేడాది దసరా సందర్భంగా అక్టోబర్ 18 నుంచి 30వ తేదీ వరకు టీఎస్ఆర్టీసీ లక్కీ డ్రా బాక్స్‌లను బస్సుల్లో ఏర్పాటు చేసింది. సోమవారం ఎంజీబీఎస్‌లో డ్రా తీయనున్నట్లు రంగారెడ్డి రీజియన్ ఇన్‌చార్జి ఆర్ఎం బి.రాజు తెలిపారు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ చేతుల మీదుగా రీజియన్ పరిధిలో 10 లక్కీ డ్రాలు తీయనున్నారని ఆయన తెలిపారు. ఇందులో ఐదుగురు మహిళలు, మరో ఐదుగురు పురుషులను ఎంపిక చేయనున్నారు. ఒక్కో విజేతకు రూ.9,900 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నిమ్స్ వైద్యుల పరిశోధన పత్రానికి మొదటి బహుమతి


ప్రజ్వల్, ఉమామహేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన తెలంగాణ న్యూరో సైన్సెస్ 8వ వార్షిక సదస్సులో నిమ్స్ వైద్యులు ప్రజ్వల్, ఉమామహేశ్వరరావు సమర్పించిన పరిశోధన పత్రానికి మొదటి బహుమతి దక్కింది. తలకు గాయాలపాలైన రోగులపై ప్రొఫెసర్ డాక్టర్ ఎం.విజయ్ సారధి మార్గదర్శకత్వంలో వీరు పనిచేస్తున్నారు.


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ తరుణ్


చిన్నారికి పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి


సైదాబాద్‌లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి


కుర్మల్‌గూడ ఇందిరానగర్‌లో చుక్కల మందు వేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, మున్సిపల్ డీఈఈ జ్యోతిరెడ్డి

పల్స్‌పోలియోకు అనూహ్య స్పందన

జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి: పల్స్ పోలియో కార్యక్రమానికి ఆదివారం అనూహ్య స్పందన లభించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది ఎల్బీనగర్ జోన్ పరిధిలోని సరూర్‌నగర్, మలక్‌పేట్, హయత్‌నగర్, తుర్కయంజాల్, బాలాపూర్ ప్రాంతాలలోని కమ్యూనిటీ హాళ్లు, వార్డు కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-5సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. కొత్తపేట డివిజన్లో ఆదివారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకట్‌నరేష్ పర్యవేక్షణలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, కార్పొరేటర్ పవన్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు మామిడి రాంచందర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో చుక్కలు పంపిణీ మరో రెండు రోజులు కొనసాగిస్తామని డాక్టర్ వెంకట్‌నరేష్ తెలిపారు.


పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలోని వార్డు కార్యాలయంలో చుక్కల మందు వేస్తున్న చైర్‌పర్సన్ స్వప్నచిరంజీవి, కమిషనర్ రవీందర్‌రెడ్డి


పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్, డాక్టర్ సరస్వతి


బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్‌కాలనీ ఫేజ్-2లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు శివ


ఇంజాపూర్ సబ్‌సెంటర్‌లో చుక్కల మందు వేస్తున్న మెడికల్ ఆఫీసర్ శ్రావణ్, సూపర్‌వైజర్ నరసింహ


ఆర్‌కేపురంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఉపేందర్‌రెడ్డి

హెల్మెట్ల వాడకంతో మరణాల రేటు తగ్గుముఖం

● రైల్వేలు, రహదారి భద్రతా విభాగం అదనపు డీజీపీ మహేశ్ భగవత్

● జిల్లెలగూడలో 'రైడ్ టు సేఫ్టీ' ర్యాలీ ప్రారంభం


విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న మహేశ్ భగవత్

సరూర్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు విధిగా ధరించి డ్రైవింగ్ చేయాలని, తద్వారా తమ ప్రాణాలను సురక్షితంగా కాపాడుకోగలుగుతారని రైల్వేలు, రహదారి భద్రతా విభాగం అదనపు డీజీపీ మహేశ్ భగవత్ అన్నారు. ఐసీఐసీఐ లాంబార్డ్, ట్రాక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బాలాపూర్ మండలం జిల్లెలగూడలోని సిల్వర్ డ్రాప్స్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన రైడ్ టు సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసి, అవగాహన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ఇద్దరు ప్రయాణికులూ హెల్మెట్లు ధరించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. 2022లో దాదాపు మూడు వేల మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడం వల్లనే తలకు గాయాలై మరణించినట్టు గణాంకాలు చెబుతున్నాయని ఆయన అన్నారు. ఈ దృష్ట్యా ఐసీఐసీఐ లాంబార్డ్, ట్రాక్ లాంటి సంస్థలు నిర్వహించే అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యవంతులై హెల్మెట్ల వాడకంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కాగా ఆదివారం నాటి కార్యక్రమంలో భాగంగా దాదాపు వేయి హెల్మెట్లు పంపిణీ చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. 2015 నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 2.97లక్షల హెల్మెట్లు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రతినిధి సుమిత్‌శర్మ, సిల్వర్ డ్రాప్స్ విద్యాసంస్థల చైర్మన్ జె.శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏవో ప్రశాంత్, ట్రాక్ సంస్థ ప్రతినిధులు కులశ్రేష్ఠ, శర్మ, రజనీగాంధీ, ఎల్బీనగర్ డీసీపీ శ్రీనివాస్, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీ విశ్వనాథ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


హెల్మెట్లు ధరించి ర్యాలీలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ పిలుపునిచ్చారు. బీజేపీ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పర్యావరణ పరిక్షణ కోసం సొంతంగా రూపొందించిన పునర్వినియోగ సంచులను ఆమె సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పంపిణీ చేశారు.

- ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

వెస్ట్ ప్రశాంత్‌నగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


ఏకగ్రీవంగా ఎన్నికైన వెస్ట్ ప్రశాంత్‌నగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

చాదర్‌ఘాట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వెస్ట్ ప్రశాంత్‌నగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ దశమ వార్షికోత్సవం సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ధనుంజయ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం వెస్ట్ ప్రశాంత్‌నగర్‌కాలనీ పార్క్‌లో వెస్ట్ ప్రశాంత్‌నగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ దశమ వార్షికోత్సవం సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌లో సభ్యులైన వారిలో 70 ఏళ్ల వయస్సు పూర్తి చేసుకున్న దాదాపు 60మంది సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పూజాల చంద్రశేఖర్, కార్యదర్శిగా జి.నాగేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా బి.సాయిప్రసాద్, కోశాధికారిగా అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా పీడీ మూర్తి, కె.సునీత, ఎంవీ మధుకర్ రావు, పీఎస్ఆర్ మూర్తి, ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు.

భూదాన భూముల అవకతవకలపై సీబీఐ విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న సర్వోదయ మండల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్

సైదాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భూదాన భూముల అవకతవకలపై ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని సర్వోదయ మండల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం సింగరేణి కాలనీలో సర్వోదయ మండల్ హైదరాబాద్ మహాసభ నిర్వహించారు. పేదలకు ఇళ్ల ఇవ్వడానికి భూదాన్ బోర్డు ఏర్పాటు చేశారని, కొంత మంది స్వార్థపరులు సొంత లాభం కోసం భూమిని అమ్ముకున్నారని విమర్శించారు. గత భూదాన్ బోర్డు చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి ఇష్టారాజ్యంగా భూదాన భూములు అమ్ముకొని కోట్లాది రూపాయలు దండుకున్నారని ఆరోపించారు. అతడిపై పలు పోలీస్ కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. భూదాన భూముల అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో అధ్యక్షుడు రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్, ప్రతినిధులు షేక్ మహమూద్, మునీరుద్దీన్ పాల్గొన్నారు.

కార్మికవర్గ ప్రయోజనాలు దెబ్బతీసేలా బీజేపీ పాలన : సీఐటీయూ


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్

మన్సూరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గ ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సంఘం కార్మికులకు శిక్షణ తరగతులను ఆదివారం ఆటోనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రమేష్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కులం, మతం పేరిట చీలుస్తూ పాలకులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటున్నారని విమర్శించారు. శ్రమకు తగిన ఫలితం దక్కాలన్న లక్ష్యంతోనే సీఐటీయూ పోరాడుతుందన్నారు. కానీ పాలకులు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకొస్తూ కార్మికుల శ్రమదోపిడీ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తిరుపతయ్య మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక వర్గాలను దోచుకుంటున్నాయన్నారు. పదేళ్లుగా కనీస వేతనాల జీఓలను సవరించకుండా కేంద్ర ప్రభుత్వం కార్మికులను అర్ధాకలితో ఉండేలా చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, సర్కిల్ కన్వీనర్లు ఎం.వీరయ్య, ఆలేటి ఎల్లయ్య, సీహెచ్ వెంకన్న, పి.రామస్వామి, కృష్ణయ్య, లింగం, లింగస్వామి, శ్రీనివాస్, చైతన్య, రాములు, యాదయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలి

వనస్థలిపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలని లయోల మోడల్ హైస్కూల్ చైర్మన్ రంగినేని వెంకట్రావ్ అన్నారు. వనస్థలిపురంలోని లయోల మోడల్ హైస్కూల్ 45వ వార్షికోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి రంగినేని శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ శ్మశానవాటికలో సదుపాయాలు కల్పించాలి

సరూర్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో గల ఎస్సీ శ్మశానవాటికలో తగిన సదుపాయాలు కల్పించాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు ఆదివారం మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డిని ఆమె నివాసం వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికలో సరైన సౌకర్యాలు లేనందున ఎవరైనా మరణించినప్పుడు అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు కలుగుతున్నాయని వారు వివరించారు. ఈ దృష్ట్యా వెంటనే తగిన చర్యలు తీసుకుని అక్కడ కనీస సదుపాయాలు కల్పించాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

సైదాబాద్ : రోడ్డు దాటుతున్న ఆరేళ్ల చిన్నారిని వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేటలో శనివారం సాయంత్రం ఆరేళ్ల చిన్నారి ఇంటి వద్ద ఆడుకుంటూ రోడ్డు దాటుతుంది. ఇంతలో వేగంగా బైక్‌పై వచ్చిన యువకుడు చిన్నారిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో చిన్నారికి తీవ్రగాయాలుకాగా ఆస్పత్రికి తరలించారు. యువకుడు బైక్‌పై నుంచి కిందపడటంతో స్వల్ప గాయాలయ్యాయి. మాదన్నపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఎగ్జిబిషన్‌లో చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండీక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్

వనస్థలిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అండ్ సేల్ మేళా విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతా వర్క్స్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్‌కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నో చికెన్, బనారస్‌శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జూవెల్లరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ఎల్‌బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 36ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు ఆదివారం నగరశివారులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. శ్రీనివాస్, నర్సింహస్వామి, సత్యనారాయణ, మాధవ్, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, రమణారెడ్డి, రామ్‌కమల్, అబ్దుల్‌హమీద్, శ్రీనివాస్, రవి, కిశోర్‌బాబు, అమీర్‌అలీ, శ్రీనివాస్‌శర్మ, కృష్ణ, సత్యనారాయణ, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


సీఐ సైదులును సన్మానిస్తున్న పీస్ కమిటీ సభ్యులు

సీఐ సైదులుకు సన్మానం

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సైదులును ఆదివారం మలక్‌పేట పీస్ కమిటీ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో కలిసి పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి సామరస్యం కోసం పీస్ కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. సీఐని సన్మానించిన వారిలో కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, జఫర్ ఇక్బాల్, చౌకి రవికుమార్, మహ్మద్ గౌస్, అస్లం ఖురేషి ఉన్నారు.

సీపీఐ నుంచి వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరిక


శ్రీనుకు పార్టీ కండువా కప్పుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగాచారి

ఎల్‌బీనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు పూజారి శ్రీను వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి తెలిపారు. ఆదివారం కొత్తపేటలోని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనుకు పాండురంగాచారి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొప్పు యాదయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రాములు, కమిటీ సభ్యులు దెందే అయోధ్య పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు చేయూత


ఆదర్శ ఫౌండేషన్ ప్రతినిధులకు నగదు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, మిత్రబృందం

దిల్‌సుఖ్‌నగర్ : చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఆదర్శ ఫౌండేషన్ అనాథ విద్యార్థుల పాఠశాల ఫీజుల నిమిత్తం బీఆర్ఎస్ చైతన్యపురి డివిజన్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన మిత్రులు గోపురం ప్రసాద్ రెడ్డి, సంతోష్‌గుప్తా, నరేందర్, సూర్య సహకారంతో రూ.45వేల నగదును ఆదివారం ఫౌండేషన్ ఇన్‌చార్జిలు జకియా ఫాతిమా, ప్రదీప్‌లకు అందజేశారు. కృష్ణ, సంతోష్‌యాదవ్, నవీన్ పాల్గొన్నారు.